# సాక్షి నిజామాబాద్

శనివారం । 27 । జూలై । 2024






## స్వేచ్ఛ రాజ్యాంగానికి లోబడి..

వ్యక్తిగత స్వేచ్ఛ ఇతరులకు ఇబ్బంది కలిగించకుండా.. రాజ్యాంగానికి లోబడి ఉండాలని న్యాయవాది రామాగౌడ్ పేర్కొన్నారు.

- 10లో ▸



## గాలివాన బీభత్సం

బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల పరిధిలో శుక్రవారం గాలివాన బీభత్సం సృష్టించింది.

- 10లో ▸

## వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
27.3 /23.1

ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లని గాలులు వీస్తాయి. పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయి.

## న్యూస్‌రీల్

### 'కార్గిల్' అమరులకు నివాళులర్పించిన ఎంపీ



సుభాష్‌నగర్: కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా న్యూఢిల్లీలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీ అర్వింద్ ధర్మపురి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సైనిక అమర వీరుల స్మారక చిహ్నం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులు అర్పించారు.

### నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేకు సన్నద్ధం చేయాలి



మోపాల్(నిజామాబాద్‌రూరల్): నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేకు టీచర్లను సన్నద్ధం చేయాలని డీఈవో దుర్గాప్రసాద్ సూచించారు. 3, 5, 8 తరగతుల విద్యార్థులకు నవంబర్‌లో ఈ టెస్ట్ ఉంటుందని పేర్కొన్నారు. ఈమేరకు నగరశివారులోని బోర్గాం(పి) జెడ్పీ ఉన్నత పాఠశాలలో గణితం, పరిసరాల విజ్ఞానానికి సంబంధించి శిక్షణా కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. రెండురోజుల పాటు శిక్షణ కొనసాగుతుందని, శిక్షణ తీసుకున్న ఉపాధ్యాయులు కాంప్లెక్స్ సమావేశాలను నిర్వహించాలని తెలిపారు. 30, 31 తేదీల్లో కాంప్లెక్స్ సమావేశాలు ఏర్పాటుచేయాలని ఆదేశించారు.

**మధ్యాహ్న భోజనం పరిశీలన..**

బోర్గాం(పి) జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని డీఈవో పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాలు వడ్డించాలని సూచించారు. మధ్యాహ్నభోజనంపై సంతృప్తి వ్యక్తంచేశారు. ఆయన వెంట హెచ్ఎం శంకర్, సర్వశిక్షా అభియాన్ నుంచి జీవన్, ఆర్‌పీ కిషన్ ఉన్నారు.

### నిజాంసాగర్‌లోకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

నిజాంసాగర్: నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 650 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు (17.8 టీఎంసీలు) కాగా.. శుక్రవారం సాయంత్రానికి 1,388.60 అడుగుల(3.519 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని పేర్కొన్నారు.

### ఊరపండుగ విగ్రహాల తయారీ పరిశీలన



నిజామాబాద్‌అర్బన్: నగరంలో ఈనెల 28న నిర్వహించే ఉర పండుగ సందర్భంగా విగ్రహాల తయారీని శుక్రవారం నిజామాబాద్ సర్వసమాజ్ కమిటీ సభ్యులు పరిశీలించారు. నకాశ్ గల్లీలో వడ్ల దాటి వద్ద సార్గమ్మలు, కొండల్ రాయుడు, భోగంసాని, మహాలక్ష్మమ్మ, మత్తడి పోచమ్మ, అంపుడు పోచమ్మ, ఐదు చేతుల పోచమ్మ, పొడాలమ్మ, పెద్దమ్మ, అడేల్లి పోచమ్మ, రాట్నం, జెండా తదితర విగ్రహాల తయారీని పరిశీలించారు. కార్యక్రమంలో సర్వసమాజ్ కో కన్వీనర్ ఆదె ప్రవీణ్ కుమార్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

### జీజీహెచ్‌లో చిన్నారులకు గుండె వైద్యశిబిరం



నిజామాబాద్‌నాగారం: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో శుక్రవారం రాష్ట్రీయ బాల స్వస్థ, జిల్లా వైద్యారోగ్యశాఖ, అపోలో ఆస్పత్రి హైదరాబాద్ ఆధ్వర్యంలో పిల్లలకు ఉచిత గుండె వైద్యశిబిరం నిర్వహించారు. 18 ఏళ్లలోపు పిల్లలకు గుండె పరీక్షలు చేశారు. ఇందులో సుమారు 156 మంది పిల్లలకు 2డీ ఎకో పరీక్షలు చేయగా.. 53 మందికి ఆపరేషన్లు చేయాల్సిన అవసరమని, 21 మందికి ఇతర పరీక్షలు, 26 మందికి ఫాలోఅప్ అవసరమని గుర్తించారు. శిబిరంలో ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో తుకారం రాథోడ్, సూపరింటెండెంట్ ప్రతిమారాజ్, డీఐవో డాక్టర్ అశోక్, నోడల్ ఆఫీసర్ సామ్రాట్, మేనేజర్ సచిన, ఆర్‌బీఎస్‌కే అరవింద్, ఫణింద్ర, వెంకటేశ్ పాల్గొన్నారు.

# ఇందూరుకు స్టేడియం కావలెను

- జిల్లాలో పెరుగుతున్న డిమాండ్
- సౌకర్యాలు లేకున్నా అంతర్జాతీయ స్థాయిలో సత్తాచాటుతున్న క్రీడాకారులు
- పాత కలెక్టరేట్ ప్రాంతంలో ఎల్‌బీ స్టేడియం తరహాలో నిర్మించాలంటున్న ప్రజలు

అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటి పతకాలు సాధించి రాష్ట్రానికి, దేశానికి కీర్తిప్రతిష్ఠలు తెచ్చిపెట్టిన ప్రతిభావంతమైన క్రీడాకారులు ఉన్న ఉమ్మడి జిల్లాలో క్రీడా స్టేడియం, మైదానం నిర్మించాలనే డిమాండ్ రోజురోజుకూ పెరుగుతోంది. ఇందూరు నగరం నడిబొడ్డున ఉన్న పాత కలెక్టరేట్ స్థలంలో హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియం తరహాలో నిర్మించాలని ప్రజలు, క్రీడాభిమానులు కోరుతున్నారు. ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం అంతంతమాత్రమే ఉన్నప్పటికీ పలువురు క్రీడాకారులు అంతర్జాతీయ వేదికలపై అద్భుత ప్రతిభ కనబరిచారు. అనేకమందికి ఆదర్శంగా నిలిచారు. అయితే ప్రభుత్వం నుంచి తగిన సౌకర్యాలు, సహకారం లభించకపోవంతో ప్రతిభ ఉన్నప్పటికీ అనేకమంది ఔత్సాహిక క్రీడాకారులు వెనుకబడిపోతున్నారు. ఇలాంటి ప్రతిభావంతులను వెలికి తీసి ప్రోత్సహించాలని క్రీడాభిమానులు డిమాండ్ చేస్తున్నారు.

–సాక్షి ప్రతినిధి, నిజామాబాద్



నగరంలోని కలెక్టరేట్ క్రీడా మైదానం

ఇందూరులో తగిన సౌకర్యాలు, ప్రభుత్వ కోచ్‌లు, ప్రోత్సాహం లేనప్పటికీ జిల్లాకు చెందిన ఆణిముత్యాలైన క్రీడాకారులు అంతర్జాతీయ పతకాలు సాధించారు. ఇలా ప్రతిభ చూపిన వారిలో అంతర్జాతీయ బాక్సింగ్ ఛాంపియన్ హుస్సాముద్దీన్ ఉన్నాడు. హుస్సాముద్దీన్ కామన్‌వెల్త్ క్రీడల్లోనూ కాంస్య పతకం సాధించాడు. నిఖత్ జరీన్ సైతం బాక్సింగ్‌లో అంతర్జాతీయ జూనియర్ ప్రపంచకప్ సాధించింది. అంతర్జాతీయ హాకీ పోటీల్లో సత్తా చాటిన యెండల సౌందర్య భారత జట్టుకు వైస్‌కెప్టెన్‌గా వ్యవహరించింది. ఫుట్‌బాల్ క్రీడలో నగరానికి చెందిన సౌమ్య అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటింది. నిజామాబాద్‌కు చెందిన ఎతెసామ్ భారత ఆర్మీ బాక్సింగ్ కోచ్‌గా వ్యవహరిస్తున్నాడు.

- అంతంతమాత్రంగా ఉన్న సౌకర్యాల మధ్యే ఈ క్రీడాకారులు ప్రతిరోజూ ప్రాక్టీస్ చేసి ఎదిగారు. పలువురు వర్తమాన క్రీడాకారులు సైతం ఇదేరీతిలో ప్రాక్టీస్ చేస్తుండడం గమనార్హం. జిల్లాలో కొన్నేళ్లుగా క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృషి చేసిన దాఖలాలు లేవు. ముఖ్యంగా క్రీడాకారులకు శిక్షణ ఇవ్వడంలో ప్రభుత్వాలు పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ వచ్చాయి. జిల్లాలో ప్రభుత్వం క్రీడాకారుల కోసం కోచ్‌లను సైతం నియమించలేదు. అయినప్పటికీ జిల్లా క్రీడాకారులు అంతర్జాతీయ వేదికలపై సత్తా చాటారు. క్రీడాకారులు ఇప్పటివరకు పాత కలెక్టరేట్ మైదానంలోనే ఇబ్బందులు పడుతూ ప్రాక్టీస్ చేస్తూ ముందుకెళుతున్నారు. ఈ ఒక్క మైదానంలోనే హాకీ, బాక్సింగ్, కబడ్డీ, బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, ఉషూ, ఖోఖో, వాలీబాల్ తదితర క్రీడలకు సీనియర్ క్రీడాకారులు శిక్షణ ఇస్తున్నారు.
- నగరం నడిబొడ్డున క్రీడా స్టేడియంతో కూడిన మైదానాన్ని నిర్మించాలని డిమాండ్ చేస్తూ అథ్లెటిక్స్ జాతీయ మెడలిస్ట్, ఉస్మానియా యూనివర్సిటీ రికార్డ్ హోల్డర్ సయ్యద్ ఖైసర్ 2010లో మూడు రోజుల పాటు నిరాహార దీక్ష చేశారు. అదేవిధంగా నగరంలో స్టేడియం కోసం 4 కిలోమీటర్ల మేర రన్నింగ్ చేశాడు.

### ఇండోర్ స్టేడియం కూడా..

నగరంలోని పాత కలెక్టరేట్ మైదానంలో స్టేడియం కోసం డిమాండ్లు పెరుగుతున్నాయి. లో పల ఫుట్‌బాల్ మైదానంతో పాటు దాని చుట్టూ 400 మీటర్ల సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్ ఏర్పాటు చేయాలని నగరవాసులు కోరుతున్నారు. ఇక్కడే ఒక పక్క బాస్కెట్ బాల్ కోసం, మరో వైపు బాక్సింగ్ ఇండోర్ స్టేడియం, ఉషూ, కబడ్డీ, బ్యాడ్మింటన్, వాలీబాల్ ఇండోర్ స్టేడియాలు నిర్మించాలని కోరుతున్నారు.

### ఓనమాలు ఇక్కడే..



నగరంలోనే తొలి అడుగు వేశాను. ఇక్కడి కలెక్టరేట్ మైదానంలో బాక్సింగ్ కోచ్ శంషుమొద్దీన్ వద్ద బాక్సింగ్‌లో ఓనమాలు నేర్చుకున్నాను. ఇక్కడ తీసుకున్న శిక్షణ వల్లే ఈ స్థాయికి వచ్చాను. ప్రస్తుతం అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నాను. ఒలింపిక్ పతకం సాధించడానికి కఠోరంగా శ్రమిస్తున్నాను. ప్రభుత్వం క్రీడాకారులకు సహకరించాలి.

–నిఖత్ జరీన్, అంతర్జాతీయ బాక్సింగ్ క్రీడాకారిణి

### ప్రోత్సహిస్తే చాలామంది ఎదుగుతారు



నా తండ్రి శంషుమొద్దీన్ వద్ద బాక్సింగ్‌లో శిక్షణ తీసుకున్నాను. బాక్సింగ్ క్రీడ వల్ల ఆర్మీలో ఉద్యోగం వచ్చింది. ఒకవైపు ఉద్యోగం చేస్తూనే, మరోవైపు పతకాలు సాధిస్తున్నాను. ప్రభుత్వం క్రీడాకారులకు, క్రీడారంగానికి ప్రోత్సాహం అందిస్తే మరెందరో క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తారు. జిల్లా కేంద్రంలో స్టేడియం నిర్మించాలి.

– హుస్సాముద్దీన్, అంతర్జాతీయ బాక్సింగ్ క్రీడాకారుడు

### సౌకర్యాలు లేకున్నా..



జిల్లాలో ఫుట్‌బాల్ క్రీడకు ప్రభుత్వ కోచ్‌లు, మైదానం కూడా లేదు. ఎలాంటి సౌకర్యాలు లేకున్నా కోచ్ నాగరాజు వద్ద చిన్న ప్రైవేట్ మైదానాల్లో శిక్షణ తీసుకున్నాను. జాతీయ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదిగాను. ప్రస్తుతం భారత జట్టులో స్థానం దక్కించుకున్నా. ఎంతో మందికి రాణించాలనే తపన ఉన్నా ప్రభుత్వ పోత్సాహం లేదు.

– గుగులోత్ సౌమ్య, ఫుట్‌బాల్ క్రీడాకారిణి

### సీఎంను కలిసి విజ్ఞప్తి చేస్తాం



ఇందూరు నగరానికి నడిబొడ్డున ఉన్న పాత కలెక్టరేట్ మైదానంలో క్రీడా స్టేడియం నిర్మాణంపై సీఎం రేవంత్ రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేయనున్నాం. నిజామాబాద్ నుంచి అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులు సత్తా చాటి దేశం, రాష్ట్రంతో పాటు జిల్లాకు ఎనలేని కీర్తిని తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో వర్ధమాన క్రీడాకారుల సౌలభ్యం కోసం స్టేడియం నిర్మాణం కోసం ముఖ్యమంత్రిని కలిసి నిధులు సాధిస్తాం.

– కేశ వేణు, కాంగ్రెస్ నగరాధ్యక్షుడు

### కలెక్టరేట్ మైదానంలోనే శిక్షణ



నిజామాబాద్ పాత కలెక్టరేట్ మైదానంలోనే హాకీలో శిక్షణ తీసుకున్నాను. ఈ శిక్షణ ఉన్నత స్థాయికి ఎదిగేలా చేసింది. నాకు ప్రత్యేకంగా కోచ్‌లు ఎవరూ లేరు. సీనియర్లు, పీఈటీలు నేర్పించిన ఓనమాలు వల్లే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాను. జిల్లాలో క్రీడాభివృద్ధి కోసం ప్రభుత్వ ప్రోత్సాహం అందించడంతో పాటు స్టేడియం నిర్మించాలి.

– యెండల సౌందర్య, భారత హాకీ అండర్–19 జట్టు కోచ్

### క్రీడాకారులు ఎదుగుతారు



నగరంలో స్టేడియం నిర్మిస్తే అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటే క్రీడాకారులు తయారవుతారు. సౌకర్యాలు లేకపోయినా హుస్సాముద్దీన్, నిఖత్ జరీన్, సౌమ్య, సౌందర్య అంతర్జాతీయంగా సత్తా చాటారు. గత ప్రభుత్వం క్రీడాకారులకు, క్రీడారంగానికి తీవ్ర అన్యాయం చేసింది. అంతర్జాతీయ పతకాలు సాధించిన కేవలం ఇద్దరు, ముగ్గురు క్రీడాకారులకే నగదు ప్రోత్సాహకాలు ఇచ్చారు. జిల్లా నుంచి ఎందరో క్రీడాకారులు ఉన్నతంగా ఎదుగుతున్నారు. ప్రభుత్వ ప్రోత్సాహం లేక ఆర్థిక ఇబ్బందులతో మధ్యలోనే ఆగిపోతున్నారు.

– సయ్యద్ ఖైసర్, జాతీయ అథ్లెటిక్స్ గోల్డ్ మెడలిస్ట్, శిక్షకుడు

### గుర్తింపు ఇవ్వాలి



నగరంలో స్టేడియం ఆవశ్యకత చాలా ఉంది. ఇందు కోసం వేలమంది క్రీడాకారులు ఎదురు చూస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులున్నా.. సౌకర్యాలు లేకపోయినా మా వంతుగా క్రీడాకారులను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు పాటుపడుతున్నాం. నాలాంటి ఎంతో మంది కోచ్‌లు క్రీడాకారులకు శిక్షణనిస్తూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా తీర్చిదిద్దుతున్నారు. ఇప్పటివరకు ఏ ప్రభుత్వం కూడా కోచ్‌లను అభినందించలేదు. సహాయ, సహకారాలు అందించలేదు. ఫుట్‌బాల్‌కు మైదానం లేక ఖాళీ స్థలాలను అద్దెకు తీసుకుని మరీ శిక్షణ ఇస్తున్నాను. పతకాలు సాధించిన తర్వాత ప్రోత్సాహకాలు అందించే కన్నా ఔత్సాహిక క్రీడాకారులకు సౌకర్యాలు కల్పించాలి. పాత కలెక్టరేట్ మైదానంలో స్టేడియం నిర్మించాలి.

– నాగరాజు, ఫుట్‌బాల్ కోచ్



# బడ్జెట్‌లో జిల్లాకు తీరని అన్యాయం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్ కులాచారి
- ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



నగరంలోని నిఖిల్‌సాయి చౌరస్తాలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

సుభాష్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో జిల్లాకు తీరని అన్యాయం చేశారని, తెలంగాణకు అన్నపూర్ణ అయిన జిల్లాకు వ్యవసాయ, ఇరిగేషన్ రంగంలో చేపట్టిన కేటాయింపులు కేవలం అంకెల గారడి అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి విమర్శించారు. బడ్జెట్‌లో జిల్లాకు జరిగిన అన్యాయంపై శుక్రవారం నగరంలోని నిఖిల్ సాయి చౌరస్తాలో బీజేపీ నాయకులు ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. అంతకుముందు బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరులతో మాట్లాడారు. నిజాంషుగర్స్ ఫ్యాక్టరీతో పాటు సారంగాపూర్ చక్కెర కర్మాగారాన్ని తెరిపిస్తామని హామీనిచ్చి, నిధులు కేటాయించలేదని ఆరోపించారు. అన్నపూర్ణ జిల్లాలోని రైతాంగానికి రైతుభరోసా, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలకు ఇచ్చిన హామీలు, రైతు బీమా, తదితర వాగ్దానాలు ఏమయ్యాయని నిలదీశారు. గల్ఫ్‌కార్మికులను నిలువునా మోసం చేశారని, వారి సంక్షేమంపై బడ్జెట్‌లో ఊసెత్తలేదన్నారు. నిజామాబాద్, ఆర్మూర్, బోధన్, భీమ్‌గల్ మున్సిపాలిటీల అభివృద్ధికి ఎంత మొత్తం కేటాయించారని ప్రశ్నించారు. ఎయిర్‌పోర్టు భూసేకరణ ఊసెత్తలేదన్నారు. ఇటీవల కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు గాడిద గుడ్డు ఇచ్చారని సీఎం విమర్శించారని, ఇప్పుడు తమ జిల్లాకు కాంగ్రెస్‌కు ఏం గుడ్డు ఇచ్చిందని ఎద్దేవాచేశారు. ముగ్గురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, సలహాదారులు, నియోజకవర్గ ఇన్‌చార్జీలు ఉండి ఏం సాధించారని ప్రశ్నించారు. రూ.3లక్షల కోట్ల బడ్జెట్‌లో రూ.లక్ష కోట్లు కేంద్రమే ఇస్తుందని పేర్కొన్నారు. ఇవి కాకుండా గ్రాంట్లు, జాతీయ రహదారుల నిర్మాణం, ఇతరత్ర అభివృద్ధికి కేంద్రమే నిధులు వెచ్చిస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్పొరేటర్లు న్యాలం రాజు, లక్ష్మీనారాయణ, పాట్కూరి తిరుపతి రెడ్డి, కోటపాటి నర్సింహ నాయుడు, భరత్‌భూషణ్, నారాయణ యాదవ్, పద్మారెడ్డి, హరీష్‌రెడ్డి, సాయివర్ధన్, రోషన్, కిషోర్, బాలు నాయక్, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

# తెయూకు రూ.42 కోట్లు మంజూరు

- అత్తెసరు నిధులతో అభివృద్ధి ఎలా.. ?
- ప్రభుత్వ తీరుపై మండిపడుతున్న విద్యార్థి సంఘాలు

తెయూ(డిచ్‌పల్లి): రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క గురువారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ యూనివర్సిటీకి రూ. 42.09 కోట్ల నిధులు మంజూరు చేశారు. గతేడాది రూ. 39.36 కోట్లు మంజూరు కాగా ఈసారి కాస్త పెంచి రూ. 42.09 కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులు బ్లాక్ గ్రాంట్ పేరిట కేటాయించడంతో వర్సిటీ టీచింగ్, నాన్–టీచింగ్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది వేతనాలకే సరిపోతాయి.

**అరకొర నిధులిచ్చి.. చేతులు దులుపుకుని..**

ప్రభుత్వాలు మారినా వర్సిటీల అభివృద్ధి పనులకు అరకొర నిధులు కేటాయించి చేతులు దులుపుకుంటున్నాయి. గతేడాది బడ్జెట్‌లో రూ. 500 కోట్లు ప్రతిపాదించినా వర్సిటీల అభివృద్ధికి పైసా మంజూరు చేయలేదు. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఉన్నత విద్యాశాఖ పరిధిలోని 12 యూనివర్సిటీలకు రూ. 500 కోట్లు ప్రతిపాదించింది. ఇందులో ఓయూ, మహిళా యూనివర్సిటీలకు రూ. 200 కోట్లు కేటాయించారు. మిగిలిన 10 యూనివర్సిటీలకు రూ. 300 కోట్లు అంటే ఒక్కో యూనివర్సిటీకి రూ. 30 కోట్లు నిధులు మాత్రమే వస్తాయి. అయితే ఈ సారైనా యూనివర్సిటీలకు అభివృద్ధి నిధులు పూర్తి స్థాయిలో ఇస్తారో లేదో వేచి చూడాల్సి ఉంది.

### వసతులు లేక ఇబ్బందులు

తెలంగాణ వర్సిటీలో సరైన మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా నూతన బాలికల హాస్టల్, ఆడిటోరియం, స్టేడియం నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. సైన్స్ కాలేజ్ భవన నిర్మాణం పనులు కొనసాగుతున్నాయి. వీటికి నిధులు అవసరం ఉంటుంది. అయితే ప్రభుత్వం అరకొర నిధులు కేటాయించడం, తర్వాత వాటిని కూడా విడుదల చేయకపోవడంతో సమస్యలు అలాగే ఉంటున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో వర్సిటీల అభివృద్ధికి అధిక నిధులిస్తామని హామీ ఇచ్చి బడ్జెట్‌లో అత్తెసరు నిధులు కేటాయించడం, ఆచార్యుల ఖాళీల భర్తీ మాటే ఎత్తకపోవడంపై విద్యార్థి నాయకులు మండిపడుతున్నారు.

## తొమ్మిది మంది తహసీల్దార్ల బదిలీ


సుభాష్‌నగర్: సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లాలో తొమ్మిది మంది తహసీల్దార్లను బదిలీ చేస్తూ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీలపై నిషేధం ఎత్తేసిన ప్రభుత్వం ఈ నెల 31 వరకు బదిలీలను చేపట్టనుంది. అందులో భాగంగా మల్టీజోన్–1 పరిధిలోని ఇతర జిల్లాల నుంచి నిజామాబాద్‌కు కేటాయించిన తహసీల్దార్లకు తాజా బదిలీల్లో పోస్టింగులు ఇచ్చారు.

| పేరు | ప్రస్తుతం పని చేస్తున్న ప్రాంతం | బదిలీ అయిన ప్రాంతం |
|---|---|---|
| కె గంగాధర్ | బోధన్ | సూపరింటెండెంట్, కలెక్టరేట్ |
| ఎంఏ కలీమ్ | రెంజల్ | బోధన్ ఆర్డీవో కార్యాలయ ఏవో |
| టి పద్మజ | ఆదిలాబాద్ | నిజామాబాద్ ఆర్డీవో కార్యాలయ ఏవో |
| ఎండీ యూసుఫ్ | ఏర్గట్ల | ఆర్మూర్ ఆర్డీవో కార్యాలయ ఏవో |
| జి సంతోష్ | మెండోరా | వేల్పూర్ |
| పి విఠల్ | నిర్మల్ | బోధన్ |
| కె సరిత | భీమ్‌గల్ | ఏర్గట్ల |
| సి సంతోష్‌రెడ్డి | ఆదిలాబాద్ | మెండోరా |
| ఏ శ్రీధర్ | బాల్కొండ | భీమ్‌గల్ |

# బదిలీలకు గ్రీన్ సిగ్నల్

- వ్యవసాయశాఖలో మొదలైన కసరత్తు
- నాలుగేళ్లు నిండితే ఆప్షన్లు పెట్టుకోవాలని ఆదేశాలు

డొంకేశ్వర్(ఆర్మూర్): వ్యవసాయ శాఖలో ఉద్యోగ బదిలీలకు రాష్ట్రశాఖ నుంచి అనుమతి వచ్చింది. ఒకేచోట పనిచేస్తూ నాలుగేళ్లు నిండిన వారంతా స్థానచలనం కోసం ఆప్షన్లు పెట్టుకోవాలని ఆదేశాలు వచ్చాయి. వెబ్ ఆప్షన్లకు ఈ నెల 27వరకు గడువు విధించడంతో వ్యవసాయ శాఖలో బదిలీల కోలహలం మొదలైంది. డీడీఏలు, ఏడీఏలు, ఏవోలు, ఏఈవోలు, సీనియర్ అసిస్టెంట్లు వారికి అనుకూలమైన స్థానాలను ఎంపిక చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఒక్కొక్కరు ఐదు స్థానాల వరకు ఆప్షన్లు పెట్టుకోవడానికి అవకాశం ఉంది. వ్యవసాయ శాఖలో జిల్లా వ్యాప్తంగా అన్ని కేడర్లు కలిపి 150 మంది వరకు ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఇందులో అత్యధికంగా వ్యవసాయ విస్తీర్ణ అధికారులు(ఏఈవో) 95 మంది ఉండగా, ఏవోలు 35 మంది వరకు ఉన్నారు. వ్యవసాయ శాఖలో చాలాఏళ్లుగా బదిలీలు లేకపోవడంతో దాదాపు 90శాతానికి పైగా ఉద్యోగులు నాలుగేళ్లకు పైబడి ఒకేచోట పని చేస్తున్నవారు ఉన్నారు. అయితే, ఆప్షన్లు పెట్టుకున్న వారందరికీ బదిలీలు చేస్తారో లేదో స్పష్టత రాలేదు. బదిలీలకు కౌన్సెలింగ్ ఎలా నిర్వహిస్తారనేది కూడా తెలియాల్సి ఉంది. రాష్ట్ర స్థాయి అధికారుల ఆధ్వర్యంలో బదిలీలు జరుగుతాయని మాత్రం వ్యవసాయ శాఖ ఉద్యోగులు పేర్కొంటున్నారు. అదే విధంగా 317 జీవో బదిలీల్లో ఇతర జిల్లాల నుంచి నిజామాబాద్ జిల్లాకు వచ్చిన కొంతమంది ఏఈవోలు తమకు సీనియారిటీ కలపాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. వేరే జిల్లాలో పనిచేస్తున్న ఏఈవోలు కోర్టుకు వెళ్లడంతో వారికి సీనియారిటీ కలిపారని, తమకు కూడా ఇలాగే చేయాలని కోరుతున్నారు.



## క్లుప్తంగా

### రుణమాఫీ కానీ రైతులు ఆందోళన చెందొద్దు


ఇనాయత్‌నగర్‌లో రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి

కమ్మర్‌పల్లి: అర్హులై ఉండి రుణమాఫీ కానీ రైతులు ఆందోళన చెందొద్దని బ్యాంకు, వ్యవసాయాధికారులను సంప్రదించాలని జిల్లా వ్యవసాయాధికారి వాజిద్‌ హుస్సేన్‌ సూచించారు. మండలంలోని ఇనాయత్‌నగర్‌లో పంటల నమోదును శుక్రవారం పరిశీలించారు. అనంతరం రుణమాఫీ పొందిన రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. రుణమాఫీ కానీ రైతులుంటే బ్యాంకు, వ్యవసాయాధికారులను సంప్రదించాలన్నారు. పంటల వివరాలను జాగ్రత్తగా నమోదు చేయాలని ఏఈవోలకు సూచించారు. ఏవో అబ్దుల్‌ మాలిక్‌, ఏఈవో సాయిరాం ఉన్నారు.

# కన్నేస్తే ఖతం

- కోనసముందర్‌లో ప్రభుత్వ భూమి కబ్జా
- సర్వే చేసి తహసీల్దార్‌ పేరిట బోర్డు ఏర్పాటు
- బోర్డును తొలగించిన భూకబ్జాదారు


ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన బోర్డు వద్ద రెవెన్యూ అధికారులు

ఖలీల్‌వాడి: ప్రభుత్వ భూమి కనిపిస్తే కబ్జా కావాల్సిందే.. గత ప్రభుత్వ హయాంలో కమ్మర్‌పల్లి మండలం కోనసముందర్‌లో కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని రక్షించేందుకు అధికార యంత్రాంగం సర్వశక్తులు ఒడ్డింది. ప్రభుత్వ స్థలాలు కబ్జాలకు గురికాకుండా ఉండేందుకు అధికారులు ఫెన్సింగ్‌లను ఏర్పాటు చేస్తే సదరు కబ్జాదారులు రాత్రి వేళల్లో వాటిని తొలగిస్తూ కబ్జాలకు పాల్పడుతున్నారు.

భూమిలేని నిరుపేదలకు గత ప్రభుత్వం కమ్మర్‌పల్లి మండలంలోని కొనసముందర్‌లో పలువురికి అసైన్డ్‌ పట్టాలను అందించింది. కానీ గ్రామానికి చెందిన నల్ల గంగాధర్‌కు 20 ఎకరాల పట్టా భూమి ఉన్నా భార్య గంగామణికి 2.10 ఎకరాల ప్రభుత్వ భూమిని పట్టా చేయించాడు. అంతేకాకుండా అదనంగా ప్రభుత్వ భూమి కబ్జా చేశారని గ్రామానికి చెందిన కండె క్రాంతి అనే వ్యక్తి తహసీల్దార్‌, ఆర్డీవో అధికారులకు సమాచార హక్కు చట్టం ద్వారా ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుతో తహసీల్దార్‌ సర్వే నంబర్‌ 404/1, 150ను సర్వే చేయించారు. సర్వేలో 404/1లో 3.33 ఎకరాలు, 150 సర్వే నంబర్‌లో 1.19 ఎకరాల భూమి కబ్జా చేసినట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. ఈ సర్వే తర్వాత రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమి పేరిట బోర్డులను ఏర్పాటు చేశారు.

కాగా ఈ స్థలంలో అధికారులు ప్రభుత్వ భూమి అని బోర్డులను చేస్తే ఏర్పాటు చేస్తే సదరు కబ్జాదారులు వాటిని తొలిగించారనే ఆరోపణలు ఉన్నాయి. మళ్లీ రెవెన్యూ బోర్డును అధికారులు ఏర్పాటు చేశారు. దీనిని కూడా వారు తొలగించారు. ఇది ప్రభుత్వ భూమి అని మూడో సారి బోర్డు ఏర్పాటు చేశారు. రెండుసార్లు బోర్డు తొలిగించినా సదరు భూకబ్జాదారులపై రెవెన్యూ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అంతేకాకుండా బోర్డు తొలగించి భూమిని చదును చేసిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామంలో చర్చనీయాంశంగా మారింది.

### నిమ్మ మొక్కలను ధ్వంసం చేశారు



నాకు కోనసముందర్‌లోని 404 సర్వే నంబర్‌లో 50 ఎకరాల భూమి ఉంది. ఇందులోని 404/21లో ఉన్న 2 ఎకరాల భూమిలో నిమ్మ మొక్కలు నాటుతున్నాను. వాటిని గ్రామానికి చెందిన నల్లగంగాధర్‌, అతని కుమారుడు సామేలు ట్రాక్టర్‌తో ధ్వంసం చేశారు. నాపై దాడి చేసి దూషించారు. ఈ విషయమై కమ్మర్‌పల్లి ఎస్సైకి ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేయలేదు. దీంతో సీపీకి ఫిర్యాదు చేశాను. అధికారులు స్పందించి న్యాయం చేయాలి.

– కండె క్రాంతి, కొనసముందర్‌, కమ్మర్‌పల్లి

# ‘వరద’ వైపే చూపు..!

- హెడ్‌ రెగ్యులేటర్‌ వరకు చేరిన వరద నీరు
- పరిశీలించిన ప్రాజెక్ట్‌ అధికారులు
- నీటిని తరలించడానికేనని ఆయకట్టు రైతుల అనుమానం


హెడ్‌రెగ్యులేటర్‌ వద్దకు చేరిన ప్రాజెక్ట్‌ నీరు

బాల్కొండ: శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌ నిండక ముందే నికర జలాలను వరద కాలువ ద్వారా తరలించే యత్నాలు జరుగుతున్నాయని రైతులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్ట్‌ నీటి మట్టం 1070 అడుగుల తర్వాత వరద కాలువ ద్వారా నీటి విడుదల చేపట్టవచ్చు. ప్రస్తుతం ప్రాజెక్ట్‌ నీటి మట్టం 1073 అడుగులు దాటింది. దీంతో బుధవారం ప్రాజెక్ట్‌ ఈఈ వరద కాలువ హెడ్‌రెగ్యులేటర్‌ను ప్రాజెక్ట్‌ అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రాజెక్ట్‌ నుంచి నికర జలాలను వరద కాలువ ద్వారా దిగువకు తరలించటానికి సన్నాహాలు జరుగుతున్నట్లు ఆయకట్టు రైతులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గత యాసంగి సీజన్‌లో కూడా వరద కాలువ ద్వారా లెక్కా పత్రం లేకుండా నీటి విడుదల చేపట్టారు. అసలు యాసంగి నీటి విడుదల ప్రణాళికలో వరద కాలువ ద్వారా నీటి విడుదల లేకున్నా అధికారులు గుట్టు చప్పుడు కాకుండా నీటిని తరలించారు. ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో 28 టీఎంసీల నీరు వచ్చిందో లేదో ప్రాజెక్ట్‌ అధికారులు వరద కాలువ హెడ్‌ రెగ్యులేటర్‌ పరిశీలించారు. ప్రాజెక్ట్‌ పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 80 టీఎంసీలు. అందులో సగం కూడా చేరక ముందే వరద కాలువ హెడ్‌ రెగ్యులేటర్‌ సందర్శించడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. గతంలో కూడా అనేక మార్లు ప్రాజెక్ట్‌లో నీటి నిల్వ సగానికి చేరక ముందే వరద కాలువ ద్వారా నీటి విడుదల చేపట్టారు. ప్రస్తుతం కూడా అదే పరిస్థితి తీసుకొస్తారని ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌ నుంచి ఖరీఫ్‌ సీజన్‌ ప్రణాళికను కూడా అధికారులు సిద్ధం చేయలేదు. ప్రాజెక్ట్‌లోకి కూడ ఆశించినంత నీరు రావడం లేదు. గరిష్ఠంగా ఇప్పటి వరకు 26 వేల క్యూసెక్కుల వరద నీరు మాత్రమే వచ్చి చేరింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు 25 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ఆయకట్టు రైతుల ప్రయోజనాలు కాపాడిన తర్వాతనే మిగులు జలాలను వరద కాలువ ద్వారా విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.




కొత్తపల్లిలో విరిగి పడిన కరెంట్‌ స్తంభాలు


పొలంలో విరిగిపడిన చెట్టు

## గాలి, వాన బీభత్సం

బాల్కొండ: బాల్కొండ, ముప్కాల్‌, మెండోరా మండలాల పరిధిలో శుక్రవారం మధ్యాహ్నం కురిసిన గాలి, వాన బీభత్సం సృష్టించింది. దీంతో ముప్కాల్‌ మండలం కొత్తపల్లి శివారులోని విద్యుత్తు స్తంభాలు నెలకొరిగాయి. రోడ్డు వెంబడి ఉన్న చెట్లు తీవ్రగాలి ధాటికి విరిగిపోయాయి. లోతట్టు ప్రాంతాలు జల మయమయ్యాయి. ముప్కాల్‌ నుంచి కొత్తపల్లి వరకు రోడ్డు వెంబడి ఉన్న సుమారు పది విద్యుత్తు స్తంభాలు స్తంభాలు నేలకొరిగాయి.

## వ్యక్తిగత స్వేచ్ఛ రాజ్యాంగానికి లోబడి ఉండాలి


మూట్‌కోర్టులో పాల్గొన్న న్యాయవాది రామాగౌడ్‌, అధ్యాపకులతో ఎల్‌ఎల్‌బీ విద్యార్థులు

తెయూ(డిచ్‌పల్లి): వ్యక్తిగత స్వేచ్ఛ అనేది ఇతరులకు భంగం కలిగించేదిగా ఉండకూడదని, రాజ్యాంగానికి లోబడి ఉండాలని నిజామాబాద్‌ సీనియర్‌ న్యాయవాది రామాగౌడ్‌ తెలిపారు. శుక్రవారం తెయూ న్యాయ కళాశాలలో ఎల్‌ఎల్‌బీ చివరి సంవత్సరం విద్యార్థులకు మూట్‌(నమూనా)కోర్టు నిర్వహించారు. మూట్‌కోర్టుకు ఎక్స్‌టర్నల్‌ ఎగ్జామినర్‌గా సీనియర్‌ న్యాయవాది రామాగౌడ్‌ వ్యవహరించారు. మూట్‌కోర్టులో భాగంగా రాష్ట్ర నిఘా వ్యవస్థ, వ్యక్తి స్వేచ్ఛ అనే అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ రెండు అంశాలపై విద్యార్థులు మూట్‌ కోర్టులో వాదనలు వినిపించారు. కార్యక్రమంలో న్యాయశాస్త్ర కళాశాల ప్రిన్సిపాల్‌, హెచ్‌వోడీ కె ప్రసన్నరాణి, బీవోఎస్‌ చైర్మన్‌ జెట్లింగ్‌ ఎల్లోసా, అధ్యాపకులు బి స్రవంతి, ఎం నాగజ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.

## నిజాయితీ చాటిన కండక్టర్‌


కరీంనగర్‌లో ప్రయాణికులకు బ్యాగును అందజేస్తున్న కండక్టర్‌

బోధన్‌: ఆర్టీసీ బస్సులో ఓ ప్రయాణికుడు మరిచిపోయిన బ్యాగును బోధన్‌ డిపోకు చెందిన కండక్టర్‌ సంజీవ్‌ తిరిగి అప్పగించి నిజాయితీ చాటుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. బోధన్‌ నుంచి వరంగల్‌ ఎక్స్‌ప్రెస్‌ బస్సులో ఈ నెల 17న విధులు నిర్వర్తించిన కండక్టర్‌ సంజీవ్‌ ప్రయాణికులు మరిచిపోయిన రెండు తులాల రెండు బంగారు గొలుసు, రూ. వెయ్యి నగదు ఉన్న బ్యాగును ప్రయాణికులకు అప్పగించినట్లు డిపో మేనేజర్‌ శ్రీనివాస్‌ శుక్రవారం రాత్రి తెలిపారు. బోధన్‌ నుంచి వరంగల్‌ వెళ్తున్న బస్సులో కరీంనగర్‌ బస్టాండ్‌ వద్ద ఇద్దరు ప్రయాణికులు బస్సెక్కి తమ బ్యాగును వదిలేసి వెళ్లిపోయారు. కరీంనగర్‌ బస్టాండ్‌ డ్యూటీ కంట్రోలర్‌ ప్రయాణికులు బస్సులో బ్యాగు మరిచిపోయిన విషయాన్ని కండక్టర్‌కు చేరవేశారు. సదరు కండక్టర్‌ బస్సులో తనిఖీ చేయగా మరో ప్రయాణికుడి వద్ద ఆ బ్యాగు ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకుని తెరిచి చూడగా బంగారు గొలుసులు, నగదు ఉన్నట్లు ధ్రువీకరించారు. వరంగల్‌ నుంచి తిరుగు ప్రయాణంలో కరీంనగర్‌ బస్టాండ్‌లో బ్యాగు పోగొట్టుకున్న ప్రయాణికులకు అక్కడి కంట్రోలర్‌ సమక్షంలో అందించారు. ఈ విషయాన్ని ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌, కరీంనగర్‌ జోన్‌ ఈడీ వినోద్‌ కుమార్‌కు తెలుపగా వారు కండక్టర్‌ను అభినందించారని పేర్కొన్నారు.

## కోర్టులో లొంగిపోయిన నిందితుడు

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని కిసాన్‌గంజ్‌ నుంచి గుంటూరు వెళ్తున్న పసుపు లారీని ఎత్తుకెళ్లిన వారిలో ప్రధాన నిందితుడు సాదుల్లా జడ్జి ఎదుట శుక్రవారం లొంగిపోయారు. జడ్జి ఆదేశాల మేరకు నిందితుడు సాదుల్లాను పోలీసులు సారంగాపూర్‌ జైలుకు తరలించారు. కోర్టులో లొంగిపోయిన ప్రధాన నిందితుడిని 14 రోజుల తర్వాత ఒకటవ టౌన్‌ పోలీసులు కస్టడీకి తీసుకునేందుకు పిటిషన్‌ వేయనున్నట్లు తెలుస్తోంది. పోలీసుల కస్టడీ తరువాత పసుపు లారీ హైజాక్‌ బయటకు వచ్చే అవకాశాలు ఉన్నాయి.

## కోర్టులో ఫొటో తీసిన వ్యక్తిపై కేసు నమోదు

ఖలీల్‌వాడి: జిల్లా కోర్టులో సాక్ష్యం చెప్పేందుకు వచ్చిన వ్యక్తిని ఫొటో తీసిన నిందితుడిపై ఒకటవ టౌన్‌ పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఫస్ట్‌ అడిషనల్‌ కోర్టులో ఓ కేసు విషయంలో సాక్ష్యం చెప్పేందుకు వచ్చిన వ్యక్తి ఫొటోలను నిందితుడు ఫోన్‌లో తీశారు. దీంతో సదరు వ్యక్తి ఈ విషయాన్ని జడ్జి దృష్టికి తీసుకెళ్లాడు. జడ్జి ఆదేశాల మేరకు ఫొటోలు తీసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

## రాష్ట్రంలో రైతు వ్యతిరేక ప్రభుత్వం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్‌ కులాచారి


మాట్లాడుతున్న దినేశ్‌ కులాచారి

సుభాష్‌నగర్‌: రాష్ట్రంలో రైతు వ్యతిరేక ప్రభుత్వం ఉందని, రైతులను మోసం చేసి అధికారంలోకి వచ్చిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్‌ కులాచారి అన్నారు. నగరంలోని బీజేపీ కార్యాలయంలో బీజేపీ కిసాన్‌ మోర్చా జిల్లా అధ్యక్షుడు పాట్కూరి తిరుపతిరెడ్డి అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. ఎన్నికల సమయంలో రైతాంగానికి ఇచ్చిన హామీలను కాంగ్రెస్‌ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. అందుకు తాజాగా ప్రవేశపెట్టిన బడ్జెట్‌ నిదర్శనమన్నారు. రాబోయే రోజుల్లో కిసాన్‌ మోర్చా ఆధ్వర్యంలో రైతుల పక్షాన పోరాటాలకు సిద్ధం కావాలని, రైతు వ్యతిరేక ప్రభుత్వంపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. బీజేపీ కిసాన్‌ మోర్చా జిల్లా అధ్యక్షుడు పాట్కూరి తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. రైతుభరోసా ఎకరానికి రూ.7500 వెంటనే రైతుల బ్యాంకు ఖాతాల్లో జమచేయాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో రైతు నాయకులు కోటపాటి నర్సింహ నాయుడు, పోతన్‌కర్‌ లక్ష్మీనారాయణ, రవీందర్‌ రెడ్డి, హరీశ్‌రెడ్డి, భరత్‌ భూషణ్‌, కిసాన్‌ మోర్చా అధ్యక్షులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల్లో పోటీ చేసే అవకాశం కల్పించాలి


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

పెర్కిట్‌: ఇద్దరికి మించి సంతానం కలిగిన వారికి స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పించాలని 1995 చట్టం రద్దు కమిటీ సభ్యులు శుక్రవారం పంచాయతీరాజ్‌, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కను కలిశారు. ఈ సందర్భంగా వారు హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేశారు. స్పందించిన మంత్రి విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో 1995 చట్టం రద్దు కమిటీ అధ్యక్షుడు అభిమాన్‌ గాంధీ నాయక్‌ దరవాత్‌, సభ్యులు దేగాం ఇట్టెడి లింగారెడ్డి, శ్రీనివాస్‌ గౌడ్‌, జి నవీన్‌ రాజ్‌, కొండ సమ్మయ్య, కిషన్‌ నాయక్‌, బుక్యా వెంకట్‌, బిచ్య ఉన్నారు.

## రైల్వేస్టేషన్‌లో రూ.55 లక్షలు పట్టివేత


పట్టుబడిన నగదుతో ఆర్‌పీఎఫ్‌ సీఐ సుబ్బారావు

ఖలీల్‌వాడి: నిజామాబాద్‌ రైల్వేస్టేషన్‌లో గురువారం రాత్రి ఆర్‌పీఎఫ్‌ పోలీసులు తనిఖీలు చేపట్టారు. తనిఖీలో స్టేషన్‌లో ఉన్న ఓ వ్యక్తి బ్యాగులో రూ.55 లక్షల నగదును పట్టుకున్నట్లు ఆర్‌పీఎఫ్‌ సీఐ సుబ్బారావు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లోని శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ.. మహారాష్ట్రలోని నాందేడ్‌ జిల్లా నర్సింగ్‌గల్లీకి చెందిన ప్రకాశ్‌ రుక్మాయి సింధే బ్యాగులో రూ.55 లక్షలు ఉండడంతో వెంటనే ఒకటో టౌన్‌ పోలీసులతో పాటు వాణిజ్యశాఖ అధికారులకు సమాచారం అందించి నగదు అప్పగించినట్లు పేర్కొన్నారు.

## క్రైం కార్నర్‌

### కారు ఢీకొని ఒకరి మృతి

- మరొకరికి తీవ్రగాయాలు


నరేశ్‌(ఫైల్‌)

ఆర్మూర్‌టౌన్‌: కారు డ్రైవర్‌ నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో ఓ నిండు ప్రాణం గాలిలో కలిసింది. పనులు ముగించుకొని ఇంటికి వెళ్దామనుకునే వారికి ప్రమాదం కారు రూపంలో ముంచుకొచ్చింది. బైక్‌ను ఓ కారు వెనుకనుంచి ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్రగాయాలైన ఘటన ఆర్మూర్‌ పట్టణంలోని నవనాథ సిద్దుల గుట్ట వెనకాల ఉన్న జాతీయ రహదారిపై శుక్రవారం చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. నిర్మల్‌ జిల్లా ఖానాపూర్‌ మండలం బాదన్‌కుర్తి గ్రామానికి చెందిన మంత్రరాజ్యం నరేశ్‌(43), పారిపల్లి నగేశ్‌ తమ వ్యక్తిగత పనుల నిమిత్తం ఆర్మూర్‌కు బైక్‌పై వచ్చారు. పనులు ముగించుకొని స్వగ్రామానికి వెళ్తుండగా నిజామాబాద్‌ నుంచి ఆర్మూర్‌ వైపు వస్తున్న కారు వీరిని వెనుక నుంచి ఢీకొన్నది. ఈ ఘటనలో నరేశ్‌, నగేశ్‌లకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు 108 అంబులెన్స్‌లో ఆర్మూర్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా నరేశ్‌ ఆస్పత్రి ఆవరణలోకి చేరుకోగానే మృతి చెందాడు. నగేశ్‌కు మెరుగైన చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు. నిర్లక్ష్యంగా కారు నడిపిన వ్యక్తిని స్థానికులు చితకబాదారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

### విద్యుత్‌షాక్‌తో ఒకరి మృతి

బోధన్‌రూరల్‌: వెల్డింగ్‌ పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు కరెంట్‌ షాక్‌ తగిలి ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని పెంటాకుర్దు గ్రామంలో చోటు చేసుకుంది. బోధన్‌ రూరల్‌ ఎస్సై నాగనాథ్‌ శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కె జైరాం(36) గురువారం పెంటాకుర్దు క్యాంప్‌ శివారులో పుర చిన్న గంగారాం అనే వ్యక్తికి చెందిన షెడ్‌ నిర్మాణ పనులను వెల్డింగ్‌తో చేస్తుండగా ప్రమాదవశాత్తు కరెంట్‌ షాక్‌ తగిలి మృతి చెందాడు. మృతుడి భార్య పవిత్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

### కుక్కల దాడిలో జింక ..



బోధన్‌: మంజీర నది తీరంలో ఉన్న సాలూర మండలంలోని తగ్గెల్లిలో శుక్రవారం వీధి కుక్కల దాడిలో కృష్ణ జింక మృతి చెందింది. ఈ విషయాన్ని గ్రామస్తులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఈ మేరకు వర్ని ఫారెస్ట్‌ రేంజ్‌ సెక్షన్‌ ఆఫీసర్‌ చంద్రప్రకాశ్‌, రుద్రూర్‌ బీట్‌ ఆఫీసర్‌ వందన గ్రామానికి చేరుకొని జింక కళేబరాన్ని పరిశీలించి స్వాధీనం చేసుకున్నారు. జింక కళేబరానికి బోధన్‌ ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి ఖననం చేసినట్లు సెక్షన్‌ ఆఫీసర్‌ పేర్కొన్నారు.

### మట్కా స్థావరంపై దాడి

ఖలీల్‌ వాడి: నగరంలో ఒకటవ టౌన్‌ పీఎస్‌ పరిధిలో మట్కా స్థావరాలపై టాస్క్‌ ఫోర్స్‌ ఏసీపీ విష్ణుమూర్తి ఆధ్వర్యంలో శుక్రవారం దాడి చేశారు. పక్కా సమాచారం మేరకు మట్కా ఆడుతున్న అబ్దుల్‌ అజీజ్‌, అబ్దుల్‌ సుశీత్‌లను అదుపులోకి తీసుకొన్నట్లు తెలిపారు. వారినుంచి రూ.6290 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నిందితులను అరెస్టు చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### ఇసుక అక్రమ నిల్వలు సీజ్‌

రెంజల్‌: మండలంలోని నీలా శివారులో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక నిల్వలను మైన్స్‌ అధికారులు శుక్రవారం సీజ్‌ చేసి తమకు అప్పగించినట్లు తహసీల్దార్‌ శ్రావణ్‌కుమార్‌ శుక్రవారం తెలిపారు. సుమారు 300 ట్రాక్టర్ల సీజ్‌ చేసిన ఇసుకను రాత్రి వేళ అక్రమార్కులు తరలించకుండా కాపాల ఏర్పాటు చేసినట్లు వివరించారు. తహసీల్‌ కార్యాలయంలో ఇసుకను శనివారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

### విద్యుత్తు స్తంభాలను ఢీకొన్న ట్యాంకర్‌



వేల్పూర్‌: మండలంలోని అంక్సాపూర్‌ సమీపంలో మెట్‌పల్లి వైపు వెళ్తున్న రోలరు ట్యాంకర్‌ గురువారం తెల్లవారుజామున అదుపు తప్పి విద్యుత్‌ స్తంభాలను ఢీకొన్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఆర్మూర్‌ నుంచి మెట్‌పల్లి వైపు వెళ్తున్న ట్యాంకర్‌ వర్షంతో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్‌ స్తంభాలను ఢీకొన్నట్లు పేర్కొన్నారు. దీంతో స్తంభాలు విరిగి కరెంటు సరఫరాకు అంతరాయం ఏర్పడినట్లు గ్రామస్తులు తెలిపారు.

### మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య



రెంజల్‌: మద్యానికి బానిసైన ఓ యువకుడు ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని నీలా గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై సాయన్న తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన లక్ష్మణ్‌(22) అనే యువకుడు మద్యానికి బానిసయ్యాడు. ఉదయం తన ఇంట్లోని గది నుంచి బయటకు రాకపోవడంతో కుటుంబీకులు గది తెలుపులు తెరిచి చూడగా దూలానికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు.తండ్రి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బోధన్‌ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

### డ్రంకన్‌ డ్రైవ్‌ కేసులో రెండు రోజుల జైలు

వర్ని: మద్యం తాగి వాహనం నడిపిన ఒకరికి బోధన్‌ ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి శేష తల్ప సాయి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు వర్ని ఎస్సై కృష్ణకుమార్‌ తెలిపారు. ఈ నెల 24న వాహనాల తనిఖీ చేస్తుండగా బోధన్‌కు చెందిన అజయ్‌ సింగ్‌ఠాగూర్‌ మద్యం తాగి వాహనం నడుపుతూ దొరికాడన్నారు. కేసు నమోదు చేసి శుక్రవారం కోర్టులో హాజరుపర్చగా జడ్జి జైలు శిక్ష విధించినట్లు పేర్కొన్నారు.

### ఒకరికి ఏడేళ్ల జైలు శిక్ష

మోర్తాడ్‌: ఏర్గట్ల మండలం తొర్తికి చెందిన మునిగె చిన్న లింబన్నకు ఏడేళ్ల జైలు శిక్ష, జరిమానా విధిస్తూ ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు జడ్జి శుక్రవారం తీర్పు వెల్లడించారు. 2020లో తొర్తికి చెందిన కుండ చిన్న సాయన్న అనే వ్యక్తి పొలంలోని డ్రిప్‌ పైప్‌లు కాల్చివేయడంతో పాటు ఫిర్యాదుదారుడిని కులం పేరుతో దూషించి, చంపుతానని బెదిరించడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. నాటి ఆర్మూర్‌ ఏసీపీ దర్యాప్తు చేసి కోర్టుకు చార్జిషీటు దాఖలు చేయగా శుక్రవారం తీర్పు వెలువడిందని ఏర్గట్ల పోలీసులు పేర్కొన్నారు.